
'ఆటా' పోటీల్లో ఎంపికైన కథ

# నిజంగా! దేవుడున్నాడు

-యస్. ఘటికాచలరావు



"**ఉ**సేయ్ అక్కా. తొందరగా రావే, ఒక తింగర లంగరొచ్చింది" గావుకేక వేశాడు బుజ్జి.

"ఏవిట్రా వెధవా? సరిగ్గా చెప్పి ఏడు. నాకర్ధం కాలేదు."

"నీకెందుకు అర్ధమౌతుంది? అవ్వదు. లంగరంటే టి.వి. యాంకరు. నీ జీవితాశయం నెరవేర్చే కల్పతరువు 'కుమారి పెంటశ్రీ' (అది అతను తనకు నచ్చని యాంకరు ఎవరికైనా పెట్టుకునే ముద్దు పేరు) ఇప్పుడు మన టి.వి. డబ్బాలో ఉంది. ఇదెవరో కొత్తదిలాగుంది. తొందరగా రావే".

మరుక్షణం ఎక్కడినుండో బాణంలా రివ్వున దూసుకొచ్చింది తెల్లటి పట్టు పరికిణీ, జాకెట్టు, తెల్లటి ఓణీలో బాత్రిసు. అంటే బాలత్రిపుర సుందరి. డబ్బాకు అరడుగు దూరంలో మఠం వేసుక్కూర్చుంది. ఆ అమ్మాయి డిగ్రీ చదువు పూర్తయింది.

"...అకిలాంధ్ర ప్రేచ్చకులకు ఇదే నా హాయ్! నేను కలాశ్రీ ని. ఈ రోజు పెళ్లిరోజు జరుపుకునే వాళ్లందరికీ మా ప్రోగ్రాం తరపున సుబాకాంచెలు. గతవారం లాగే మళ్లీ ఈవారం కూడా మన స్టుడియోకు విచ్చేసిన మన అబిమాన ఆస్య నటులు శ్రీ బుద్దావతారం గారికి మా దన్యవాదాలు. మరి కార్రిక్రమంలోకి వెల్దామా..." అంటూ పక్షవాతం వచ్చిన వాళ్ళలా మూతి కొంకర్లుచేసి వచ్చీ రాని తెలుగులో మాట్లాడింది ఆ యాంకరు.

అమాంతం టి.వి. డబ్బామీదికి లంఘించి అక్కడ కనబడే టి.వి. యాంకరును పెద్ద శబ్దంతో చప్పుచప్పున ముద్దెట్టుకుంది బాత్రి. 'ఔను! ఎవరో కొత్తదే! అబ్బ! ఎంతందంగా ఉందీ!' అని మనసులో గొణుక్కుంటూ.

"ఛీ... ఛీ... ఇంకానయం. ఆట్టే నాకలేదు. ఐనా ఇదేం వెట్టే. ఎట్టి తోలుంటే సరిపోతుందా. దానికి తెలుగు మాటే సరిగ్గా మాట్లాడడానికి రాలేదు. పైగా దెయ్యం లాగా జుత్తు విరబోసుకుని... ఆ అవతారాన్ని చూడలేక పోతున్నాం."

"నోరు ముయ్యెరా. జుట్టు విరబోసుకునే దాంట్లోని అందం మీకేం తెలుసు. నీకసలు జుట్టుంటేగా. బోడి గుండు వెధవ్వి" అంటూ జడకున్న రబ్బరు బ్యాండును లాగేసింది తను కూడా ఆ యాంకరును అనుకరిస్తూ.

బుజ్జిగాడి అదృష్టమో, దురదృష్టమో ఇంతవరకు వాడు 'క్రాఫు' అన్న మాటెరుగడు. రెణ్ణెల్లకోమారు ఏదో ఒక మొక్కుబడి రూపంలో వాళ్ళ అమ్మమ్మకు దొరికిపోతాడు. అందువల్ల వాడికి దువ్వెన అన్నా కొబ్బరినూనె అన్నా ఏమిటో తెలియదు. పదో తరగతి చదివే బుజ్జి అసలు పేరు బ్రహ్మాజీ. ఆ ఇంట్లో అందరి పేర్లూ ప్రత్యేకంగానే ఉంటాయి.

అకస్మాత్తుగా బాత్రిసు అలా తన కళ్ళముందే తల విరబోసుకోవడంతో బెంబేలెత్తిపోయి "అమ్మోయ్! బాబోయ్! మనింట్లోకి దెయ్యమొచ్చిందేవ్" అంటూ పొలికేక పెట్టాడు బుజ్జి.

"ఛంపుతా గాడిద. ఎందుకా అరుపు? నేనేం దెయ్యం కాదు. కావాలంటే కాళ్ళు చూసుకో. ద్వాపరయుగంలో మహాభారతంలో ద్రౌపది జుట్టు విరబోసుకోగా లేంది ఈ కాలంలో మేం అలాచేస్తే తప్పా."

"పిచ్చిదానా. వాళ్ళంతా కారణజన్ములే. వాళ్ళతో పోల్చుకోకు. కళ్ళు పేలిపోతాయ్. ఈ కలియుగంలో జుట్టు విరబోసుకునే వాళ్ళని దెయ్యాలంటారు. దాని మాటలు, తింగర చేష్టలు చూస్తే వెళ్ళి నాలుగు తన్నాలనిపించడం లేదా. నా చేతికి దొరికుంటే ఈపాటికి దాన్ని ఉతికి పారేద్దును. ఐనా నీకిదేంపిచ్చే! మా ఖర్మకు నువ్వుకూడా వెళతానంటున్నావు యాంకరుగా."

"కేవలం దాని అందం కోసమే దాన్ని చూస్తున్నా. దాని భాష ఛండాలంగా ఉంటుందని నాకూ తెలుసు. అది బాగా మాట్లాడ్డం లేదు కాబట్టే నేను వెళతానంటున్నాను. నేను వెళ్ళి మన తెలుగు భాషలను జీవింపజేస్తాను" అంది భావావేశంతో.

"ఇహ ఐనట్టే..." అంతలో వాళ్ళ అమ్మమ్మ వచ్చింది. "మామ్మే, మామ్మే, నాతల్లే. నీకా ఉజ్జోగం వస్తే, అన్నవరం వెళ్ళి వీడి తల నీలాలు సమర్పిస్తాను" అంటూ ఆప్యాయంగా బుజ్జి తల నిమిరింది.

"అమ్మమ్మా!" అంటూ అరిచాడు. "ఇదేం అన్యాయమే! ఇంకా అర అంగుళం కూడా మొలవలేదు. అప్పుడేనా? నేనొప్పుకోను. కావాలంటే దానికే గుండు గీయించు. బారెడు పొడుగుంది దాని జడ! దెయ్యం లాగా అలా విరబోసుకోవడమైనా తప్పుతుంది. జడ కావాలనుకున్నప్పుడు విగ్గు పెట్టుకోవచ్చు. ఐనా ఉద్యోగం వచ్చేది దానిక్కదా. దీనికి గీయించడమే సరి. ఇక మీదనే మనుషులు, మొక్కుబడి" అన్నాడు తనకు వచ్చిన ఇంగ్లీషులో.

"ఒరేయ్! బుజ్జికన్నా. నీది మనింట్లో అందరికీ అచ్చొచ్చిన గుండు. అందువల్ల నువ్వు అరిచి గీపెట్టినా లాభం లేదు. నువ్వు మళ్ళీ బుక్కై పోయావురోయ్!" అన్నది బాత్రి సంబరంగా.

"అలాటిదేదైనా జరిగితే... నిద్దట్లో నీ గుండు నేను గీస్తాను. ఉహూ. అమ్మమ్మ చేతనే గీయిస్తాను."

"నా జుట్టులోనే ఉందిరా నా అందమంతా. అలాంటిది అమ్మమ్మ ఎలా చేస్తుందని అనుకున్నావు? ఊరికే గొడవ చేయకు. నన్ను టి.వి. చూడనీ. వచ్చేవారమే ఇంటర్వ్యూ."

"దాన్ని చూసి ఏం నేర్చుకోవాలనుకున్నావే మహాతల్లీ? అదసలే తింగరది. దాని వేషాలు నువ్వూ వేస్తే నీకు ఖచ్చితంగా ఈ ఉద్యోగం రాదు. పంగనామాలే గతి."

"అమాయకుడా. దాన్నే మాడ్యులేషన్ అంటారు. తెలీకపోతే తెల్సుకో. ఏ పదాన్ని ఎలా పలకాలి, ఎలా పలికితే ప్రేక్షకులు మెచ్చుకుంటారు, రిసీవ్ చేసుకుంటారు అనేది ఒక కళ. అది అందరికీ రాదు. ఐనా ఇవన్నీ

నీకెందుకురా. గుండు గీయించుకోడానికి సిద్ధంగా ఉండు."

"నేను ఇల్లొదిలి పారిపోతాను."

"ఎక్కడికెళతావు?"

"ఎక్కడికో... తిరపతికెళ్తాను. నీకెందుకు?"

"హహ్హహ్హా. చూశావా నీకు తెలీకుండానే నీ తల మొక్కుబడిని కోరుకుంటూంది. అన్నవరమైతేనేం, తిర పతైతేనేం. అంతా నున్నగానే గీస్తారు. పట్టణాలు వేరు, పని ఒకటే. నీ పని కదలకుండా కూర్చోడం అంతే. కదిలేవ్ నొక్కులు, గాట్లు పడతాయి. జాగ్రత్త!"

బుజ్జికి ఇక ఉక్రోషం తాళలేక "అమ్మా"అంటూ అరి చాడు. వాళ్ళమ్మే వాణ్ణి అప్పుడప్పుడూ కాపాడుతూ ఉంటుంది.

"ఒసేయ్ బాలా. ఎందుకే వాణ్ణిలా ఏడిపిస్తావు. ఈడొ చ్చిన పిల్లవు. కాస్త అణకువగా ఉండడం నేర్చుకో" అంటూ సున్నితంగా మందలించింది జ్ఞానేశ్వరి. అంత లోనే బుజ్జి భగవంతుణ్ణి మొక్కుకోవడం ప్రారంభిం చాడు తన అక్కకు ఈ ఉద్యోగం రాకూడదని. ఎందు కంటే అది వాడి జీవిత సమస్య. ఈసారి ఎలాగైనా అమ్మమ్మకు చిక్కగూడదనుకున్నాడు. తన వయసుకు తోచిన స్థాయిలో మెదడుకు పని కల్పించాడు.

* * *

"చూడమ్మాయ్. మా కంపెనీలో ఉద్యోగం కావా లంటే మీ మదర్‌టంగ్ తెలుగు ఐ ఉండకూడదు. అందునా నువ్వు వచ్చింది అతి కీలకమైన యాంకరు పోస్టుకు."

"అదేంటి సార్. మీది తెలుగు టి.వి.యే కదా."

"ఔనమ్మా. ఐనా నేనేమీ చేయలేను. ఎందుకంటే ఇది మా బిజినెస్ స్ట్రాటజీ అంటే వ్యాపార విధానం. మాకు ఇదొక ఛాలెంజ్ అంటే సవాలు. భాష తెలియని వాళ్ళ చేత భాషను పలికించడంలోనే ఉంది అసలైన ఛాలెంజ్. అవతలి వాళ్ళు ఇంకా ఒకడుగు ముందుకేసి నేనెప్పిన ఈ ముక్కని ఏకంగా ప్రకటనలోనే వేశారు. మేం అప్పుడు మర్చిపోయాం కాబట్టి ఇప్పుడూ చెప్పాల్సి వచ్చింది. భాష తెలియని వాళ్ళచేత పలికిం చడం, పాడించడం, చదువురాని వాళ్ళ చేత చదివిం చడం ఇవన్నీ మా ఉద్యోగంలో మాకు పెను సవాళ్ళు. అప్పుడే మేము ప్రేక్షకులకు వెరైటీ కార్యక్రమాలు అందించగలుగుతాము. ఈ సవాళ్ళలో గెలిస్తేనే మాకు జీతం, జీవితం."

"సార్. మీరు ఏ పదాన్ని ఎలా పలకమంటే అలా పలుకుతాను. చిలకకు నాకు ఏమాత్రం తేడా లేదను కోండి. ఇది నా జీవితాశయం సార్. ఎలాగైనా ఈ ఉద్యోగం ఇప్పించండి"అంటూ ప్రాధేయపడింది బాత్రి.

"నేనేమీ చేయలేని పరిస్థితిలో ఉన్నాను. మిగతా అర్హ తలన్నీ బాగానే ఉన్నాయి గానీ, ... సారీ... ఈ ఉద్యోగం నీకు రాదు... రాదు గాక రాదు."

"ఎందువల్ల సార్?"

"చెప్పాను గదమ్మా. ఛాలెంజ్... స్ట్రాటజీ... వెరైటీ... మాడ్యులేషన్... వగైరా ... వగైరా..."

మౌనంగా కాస్సేపు కూర్చున్న బాత్రికి మెరుపులా ఓ ఐడియా వచ్చింది. ఎలాగైనా సెలెక్ట్ అయి తీరాలన్న పట్టుదల ఉందిప్పుడామెలో. ఇక చేసేదేమీ లేదన్నట్టు దిగులుగా ముఖం పెట్టుకుని లేచి నిలబడి "థాంక్స్ సార్. నేను వెళ్తాను. ఈసారి భాషను మర్చిపోయి మళ్ళీ వస్తాను. ధన్యవాదాలు" అంటూ బయటికి నడిచింది.

ఆమె ఇంకా నాలుగడుగులు వేసీవేయకముందే వెనక నుండి "ఆగు" అన్న గావుకేక వినబడింది. ఆగి వెను కకు తిరిగి చూసింది బాత్రి.

"ఎంత చక్కగా మాట్లాడావు. ఇంతసేపూ ఈ టాలెంట్ ఏమయింది? నన్ననవసరంగా ఇబ్బంది పెట్టావు. ఎక్కడ నేర్చుకున్నావు ఇంతటి అద్భుతమైన మాడ్యులే షన్?" అన్నాడు ఆ అధికారి.

"మీ టి.వి.లోని 'పెళ్ళిదినం' ప్రోగ్రాంలోని యాంకరు నా అబిమాన లంగరు..."అనేసి నాలుక్కరుచుకుని "నా అబిమాన యాంకరు, కలాశ్రీ. ఆమెను చూసి నేర్చుకు న్నాను" అన్నది.

"ఓ! కళాశ్రీ! మరైతే చెప్పవేం! చూశావా నా సెలక్షన్! ఆ అమ్మాయిలా ఉండాలి. షి ఈజ్ మోస్ట్ టాలెంటెడ్ కదూ" అన్నాడు ఆనందం పట్టలేక.

"ఐతే ఈ ఉద్యోగం నాకు వస్తుందంటారా."

"ప్రయత్నిస్తున్నాను. నువ్వు వెళ్ళవచ్చు."

"ఒక ముఖ్యమైన సమాచారం సార్. మీరు చెప్పే ఆ 'మాడ్యులేషన్' అబివృద్ధి చేసుకునే అవకాశం నాకు బోల్డుంది. ఎందుకంటే చిన్నప్పుడు నాకు పోలియో చుక్కలు వేయించలేదు. ఈ యాంగిల్ నుండి కూడా మీరు కొంచెం ఆలోచించండి."

"ఈజిట్! వెరీ గుడ్... వెరీ గుడ్! తప్పకుండా ఆలోచి స్తాను."

ఆమె బయటకు వెళ్ళిన తరువాత ఆ అధికారి తీవ్రంగా బుఱ్ఱను గోక్కుంటూ మరీ ఆలోచించసాగాడు 'పోలియో చుక్కలు గురించి ఎందుకు చెప్పిందబ్బా! మాడ్యులేషన్‌కు పోలియో చుక్కలకు ఏంటి సంబంధం' అని.

* * *

అర్ధరాత్రైనా నిద్ర రావడంలేదు. బుజ్జి భజన ఇంకా తీవ్ర రూపం దాల్చింది. చిన్నవాడు, అమాయకుడు కావడం మూలాన అతని తపన అంతాఇంతా కాదు. ఎలాగైనా తన అక్క బాత్రిసుకు ఆ ఉద్యోగం రాకూడద



"...అకిలాంద్ర ప్రేచ్చకులకు ఇదే నా హాయ్! ఈరోజు దినం జరుపుకునే వాల్లం దరికీ సుబాకాంచెలు... చెమించాలి! దినం అంటే పెల్లిదినం. అందుకే సుబాకాంచెలు. మరి కారిక్రమంలోకి వెల్దామా..."అంటూ పక్ష వాతం వచ్చిన వాళ్ళలా మూతికొంకర్లుచేసి వచ్చీరాని తెలుగులో మాట్లాడింది బాత్రి.

న్నదే అతని కోరిక. ఆ వయసుకే అతనికి కాస్తంత మంచిచెడుల అవగాహన ఉండడం నిజంగానే హర్షించ దగ్గ విషయం. ముఖ్యంగా భాష, కట్టు, బొట్టు సాంప్ర దాయాల విషయంలో అతను అంత నిబద్ధతగా ఉండడం ఆశ్చర్యమే. అర్ధరాత్రి తన అరంగుళం జుట్టును ఆప్యాయంగా ఓమారు తడుముకున్నాడు బుజ్జి. 'జుట్టు గతి ఇంతే...' అనే పాట అనాలోచితంగా అతని మనసులో పెల్లుబికింది. 'వీళ్ళ మొక్కుబడికి నేనే దొరికానా? ఈ సాంప్రదాయాన్ని విరగ్గొట్టడం ఎలా?' అందుకని అతను ఏం చెయ్యడానికైనా సిద్ధమే.

ఆ రాత్రి కలలో...

"... అకిలాంద్ర ప్రేచ్చకులకు ఇదే నా హాయ్! ఈరోజు దినం జరుపుకునే వాల్లందరికీ సుబాకాంచెలు... చెమిం చాలి! దినం అంటే పెల్లిదినం. అందుకే సుబాకాంచెలు. మరి కారిక్రమంలోకి వెల్దామా..."అంటూ పక్షవాతం వచ్చిన వాళ్ళలా మూతికొంకర్లుచేసి వచ్చీరాని తెలు గులో మాట్లాడింది బాత్రి. అమ్మమ్మ అమాంతం టి.వి. డబ్బామీదికి బాత్రిని గార్తిగా ముద్దెట్టుకుంది. బుజ్జికి కడుపులో ఏదో వికారంగా అనిపించింది. దిగ్గున లేచి కూర్చున్నాడు బుజ్జి.

తెల్లవారబోతోంది.

వచ్చిన కలను మరోమారు మననం చేసుకున్నాడు. 'పుత్రోత్సాహం గురించి విని ఉంటాం. పౌత్రికో త్సాహం అంటే ఇదేనేమో. మందలించాల్సిన మనవాళ్ళే ముద్దెట్టుకుంటూంటే మరిక భాషను కాపాడేదెవరు? టి.వి.లను కాపాడే వాళ్ళీదేశంలో లేనేలేరా?' అందునా తెల్లవారుఝామున వచ్చే కలలు నిజమౌతాయంటారు. దానికితోడు ముందురోజు సాయంత్రం వచ్చీరాగానే బాత్రి ఆత్మవిశ్వాసం చూసి బుజ్జి నీరుగారిపోయాడు. "అమ్మమ్మా. ఈ ఉద్యోగం ఖచ్చితంగా నాకేనే" అన్న బాత్రి మాటలు ఇంకా అతని చెవుల్లో గింగురుమంటు న్నాయి.

"ఎలా చెప్పగలవే?"అన్నది అమ్మమ్మ.

"ఏముందీ. ఆ కళాశ్రీ లాగా నాలుగు మాటలు మాట్లాడాను. అంతే..."

ఇక లాభం లేదనిపించింది బుజ్జికి. తను వెళ్ళి ఆ అధి కారిని బెదిరించలేడు. అలాగని బాత్రిని టి.వి.లో జుట్టు విరబోసుకుని చూడలేడు. ఎలా? ఏం చెయ్యాలి? భగ వంతుణ్ణి ప్రార్థించడం తప్ప తను వేరేమీ చెయ్యలేడు. అంతలోనే అద్భుతమైన ఓ ఆలోచన వచ్చింది. వెంటనే దాన్ని అమలుచేయాలనుకున్నాడు.

* * *

పొద్దున్నే లేవగానే ఏదో శుభం జరగబోతూందనిపిం చింది బాత్రికి. ఇంటర్వ్యూకెళ్ళి అప్పుడే సుమారుగా నెల కావస్తూంది. ఈపాటికి ఉత్తరమేదైనా వచ్చి ఉండాలే! బాత్రికి భూమ్మీద కాళ్ళు నిలవడం లేదు. ఎంత త్వరగా ఆ ఉత్తరం వస్తుందా ఎప్పుడు టి.వి.లో మనం కనబడతామా అన్న ఆతృత అధికం కాసాగింది.

"సార్. పోస్ట్!"


బాత్రి పరుగుపరుగున వెళ్ళి ఉత్తరం అందుకుంది.

ఎక్కడనుండి వచ్చిందో సులభంగానే తెలిసింది. ఆమె సంతోషానికి అంతులేదు. "అమ్మమ్మా!"అంటూ గావు కేక పెట్టింది. పోష్టుమేన్ ఉలికిపడి కంగారులో సైకిలెక్క బోయి అదుపుతప్పి దబ్బున కిందపడ్డాడు.

"ఏమైందమ్మా" అతికష్టంమీద ముక్కుతూ లేచి అడి గాడు.

(మిగతా 12వ పేజీలో)

# కారులూ.. సంగీతకారులు!




ప్రముఖ గాయకులు, విఖ్యాత వాద్యకారులు- శ్రోతలను తమ సంగీతంతో ఏవో అద్భుత లోకాలలో విహరింప చేస్తారు. అయితే వీరు కచేరీలకు గానీ, స్వంత పనులపై గానీ ఏవిధంగా ప్రయాణాలు చేస్తారు?

వైద్యనాథ అయ్యర్ కచేరీలకు వెళ్లేటప్పుడు ఓ గుర్రంపై స్వారీచేసేవారు. ఆ అశ్వాన్ని టాంజోర్‌ను పాలించిన శరభోజీ ఆయనకు బహూకరించాడు. గానమ్ కృష్ణఅయ్యర్ తనతో తలపడే సంగీతకారులందరినీ ఓడించాడు. కృష్ణఅయ్యర్ కూడా పాటకచ్చేరీలకు గుర్రంపైనే వెళ్లేవాడు. చివరికి ఓపిక సన్నగిల్లాక, కృష్ణఅయ్యర్- పల్లకిలో ప్రయాణం సాగించాడు. ఆ పల్లకిని ఆయనకు కచ్చి కల్యాణ రంగ భూపతి బహూకరించాడు. భూపతి, కృష్ణఅయ్యర్‌కు వీరాభిమాని! పల్లకితోపాటు సేవకులను కూడా పంపేవాడు.

*1990* ప్రాంతం నాటికి గాయకులు, వాయిద్యకారులు కచేరీలకు కార్లలో ప్రయాణాలు సాగించసాగారు. తొలిసారిగా కారును తన కచేరీలకోసం వినియోగించినది ముసిరి సుబ్రమణ్యా అయ్యర్. సంగీతకారులలో మొదట కారు కొన్నది కూడా ఆయనే! అనేక సంవత్సరాలు మైలాపూర్ రోడ్లపై ఆయన టూస్ట్రోక్ డికెడబ్ల్యు కారు వేగంగా దూసుకువెళ్లడం ఎందరో అభిమానులు చూసేవారు. నగరంలో ఏవైనా గొడవలు జరిగే సమయంలో కూడా ముసిరి ధైర్యంగా తన కారు నడుపుకొంటూ వెళ్లేవాడు- తన పక్కన అర్ధాంగిని కూర్చోపెట్టుకొని దిండిగల్ వరకూ!

ముత్తయ్య భాగవతార్‌కు వైభవోపేతమైన జీవితం గడపడం అంటే మహా ఇష్టం! ఆయన ఓ 'టాల్‌బోట్ టూరర్' కారుకు యజమాని. "స్వాతి తిరునాళ్ అకాడమీ"కి ప్రిన్స్‌పాల్‌గా నియమించబడ్డాడు ఆయన. కచేరీలకు, అకాడమీకి హాయిగా ఆ కారులో వెళ్లేవాడు!

టి.యన్.రాజరత్నం పిళ్ళేకు సుఖాల పట్ల ఎంతో మోజు! ఆయన దర్జాగా జీవితం గడిపాడు తన మందీమార్బలం కోసం ఓ పెద్ద మోటారు వాహనాన్ని ఖరీదుచేశాడు. ఆయనగారికి చాలామంది భార్యలు ఉండేవారు. వారిని కార్లో కూర్చోపెట్టుకుని 2 పెంపుడు కుక్కలు, కొందరు అసిస్టెంట్లతోపాటు ఒక పిల్లవాణ్ని తన కార్లో తీసుకువెళ్లేవాడు కచేరీలకు. ఆ కుర్రవాడు ఆయనగారి ముక్కుపొడుం బాక్సు, తమలపాకుల పెట్టె పట్టుకొనేవాడు. రాజరత్నం ఆ భారీ కారుకు మొదటి ఇన్‌స్టాల్‌మెంట్‌ను మాత్రమే చెల్లించాడు. తతిమా ఇన్‌స్టాల్‌మెంట్లు చెల్లించే బాధ్యత తన ప్రాణమిత్రుడైన గాయకుడు యం.యం.దండపాణికి అప్పగించాడు!

పళని సుబ్రమణ్యా పిళ్లే ప్రముఖ మృదంగ విద్వాంసుడు. మృదంగ విద్వాంసులలో ఆయనే మొదటిసారిగా కారును ఖరీదుచేశాడు. ఆ విద్వాన్‌కు కార్లంటే మహా ప్రీతి. ఎప్పుడెప్పుడు మార్కెట్‌లోకి కొత్త మోడల్ కారు వస్తుందా అని చూసేవాడు. అటువంటి కారు చూడగానే, దానిని స్వంతం చేసుకునేవాడు. ఆయన అర్ధాంగి కోలార్ రాజమ్మాళ్ భర్తగారి కార్ల వ్యామోహానికి సణుగుతూ, గొణుగుతూ ఉండేది! పిళ్లేకు ఇద్దరు భార్యలు. వీణ మాస్ట్రో యస్.బాలచందర్ కార్ల విషయంలో పిళ్లేకు సలహాలు ఇచ్చేవాడు.

వయొలిన్ వాద్యకారునిగా పేరుప్రఖ్యాతులు పొంది ఆ రంగంలో ప్రథమ స్థానాన్ని సాధించిన కె.యస్.వెంకట్రామయ్య కార్లను ఎంతో ప్రేమించేవాడు. ఆయన ఒకటి వెంట ఒకటి మోరిస్ మైనర్, ఫోర్డ్‌పెర్‌ఫెక్ట్, ఫియట్ కార్లు కొన్నాడు. అయితే వాటిని డ్రైవ్ చెయ్యడానికి భయపడేవాడు. ఆ బాధ్యతను తన 2వ కుమారునికి అప్పగించాడు.

అద్భుత వయొలినిస్ట్ టి.చౌడయ్యా ఆస్టిన్ కార్లో సుఖంగా కూర్చుని వేగంగా ఆ కారుని స్వయంగా నడిపేవాడు. కచేరీలకు తప్పనిసరిగా అందులోనే వెళ్లేవాడు. అయితే తరచుగా ఆస్టిన్ ప్రయాణం సాగించడానికి మొరాయించేది. ఒకసారి, మహారాజు కృష్ణరాజేంద్ర వడయార్ బందిపూర్ అడవిలోని తన గెస్ట్‌హౌస్‌లో బసచేశాడు. రాత్రి సమయంలో చౌడయ్య రోడ్డుపై తన కారుతో అవస్థ పడడం ఆయన చూశాడు. కోయంబత్తూరులోని ఒక కచేరీకి వెళ్లిన చౌడయ్య మైసూరుకు తిరిగి వచ్చాడు. రాజుగారు, చౌడయ్యకు కబురుచేశారు. తనను కలవమని చౌడయ్య వెళ్లి కృష్ణ రాజేంద్రను కలిశాడు. "చౌడయ్యగారూ! మీ కారు ఎలా పనిచేస్తోంది?" రాజుగారు అడిగాడు. "అయ్యా, నా కారు చాలా బాగా పనిచేస్తోంది. దాన్ని చూస్తే నాకు ముచ్చట వేస్తోంది! ఎంత డబ్బు ఖర్చు పెట్టినా అటువంటి కారు దొరకదు!"అంటూ చౌడయ్య తన కారును గొప్పగా పొగిడాడు! రాజుగారు చిరునవ్వు నవ్వుతూ మౌనంగా ఉండిపోయాడు. మహిళా గాయకురాలలో తొలిసారిగా కారు కొన్నది రాజం పుష్పవనమ్. ప్రస్తుతం అనేక మంది ప్రముఖ సంగీతకారులకు కార్లు ఉన్నాయి. వైలనిస్ట్ కున్నక్కుడి వైద్యనాథన్ తన కారుకు చిత్రంగా వందలాది వయొలిన్ స్టిక్కర్లను అంటించి ఎంతో ఆనందిస్తూ ఉంటాడు!

**-కొడిమెల**

---

*(9వ పేజీ తరువాయి)*

"నాకు ఉద్యోగమొచ్చింది"అంటూ లోపలికి పరిగెత్తింది.

"ఛూ! ఉఫ్!!" అంటూ వీపుమీద తట్టుకుని, కళ్ళు పెద్దవిగా చేసుకుని తలను గుండ్రంగా రెండుమార్లు తిప్పి మెల్లిగా ముందుకు సాగాడు.

ఇల్లంతా వెదికినా అమ్మమ్మ కనబడలేదు. తిరిగి తిరిగి మళ్ళీ బయటికి వచ్చిన బాత్రికి ఎదురుగా కళ్ళు మిరుమిట్లుగొలిపే కాంతితో గోపుర కలశం ఒకటి కనబడింది. ఆ కాంతిని తట్టుకోలేక చేతిని అడ్డం పెట్టుకుని గబుక్కున కళ్ళుమూసుకుంది. కాస్సేపటికి నెమ్మదిగా పరికించి చూస్తే అది గుడి గోపుర కలశం కాదు. మరేమై ఉంటుందబ్బా అంటూ కాస్త ఆ కాంతికి చేతులడ్డం పెట్టుకుని చూసింది. వీధి గుమ్మం పక్కన గోడమీద చింతపండు బూడిద వేసి బాగా తోమిన చెంబులాంటి కంచు పాత్ర ఒకటి బోర్లించినట్టు కనబడింది. మనింట్లో అలాంటిది లేదే అనుకుని మళ్ళీ చూసింది. అప్పుడు ఆ గుమ్మం దగ్గర బుజ్జి కనబడ్డాడు... గుండుతో! ఆ మిరుమిట్లు గొలిపే కంచు పాత్ర వాడి గుండని అర్థమైంది. పట్టించిన నూనె ప్రభావంతో అది అద్వితీయంగా మెరుస్తూ ఉంది. గుమ్మం బయట వాడికి కాసింత దూరంలో అమ్మమ్మ!

"బుజ్జీ" అంటూ అమాంతంగా అతనివైపు ఉరికింది బాత్రి.

"నేనంటే నీకెంత అభిమానంరా! నీ గుండు చూస్తేనే తెలుస్తుంది నాకు ఉద్యోగమొచ్చిందని. అంత ఖచ్చితంగా ఎలా పసికట్టగలిగావురా" అన్నది ఆనందంతో ఉక్కిరిబిక్కిరౌతూ, అతని గుండు తడుముతూ. బుజ్జి మౌనంగా లోపలికి అడుగులేశాడు.

అంతలో బాత్రి అమ్మమ్మ కూడా లోపలికి వచ్చింది.

"అమ్మమ్మా! ఇదిగో ఉత్తరం. నాకు ఉద్యోగం వచ్చింది. వాడి గుండు సాక్షిగా. మన చెప్పేదానికంటే ముందుగా వాడు మొక్కుతీర్చేశాడు" అన్నది ఆనందం పట్టలేక.

"నా బంగారు తండ్రే. అక్కంటే ఎంత అభిమానం! ముందుగా కవరు విప్పి చూడవే. ఎప్పుడు రమ్మన్నారో." అన్నది ఆమె బాత్రి బుగ్గలు నిమురుతూ.

బాత్రిసు కవరు విప్పింది. ఉత్తరం చదవసాగింది. ఆమె ముఖంలోని భావాలు మారసాగాయి. ఎక్కువగా ఏమీరాయలేదు అందులో.

"...మౌఖిక పరీక్షకు విచ్చేసినందుకు ధన్యవాదములు. మిమ్ములను ఎంపిక చేయలేనందుకు సంతసించుచున్నాము. మా నూతన కార్యక్రమమైన 'పెళ్ళిరోజు' గురించి అత్యంత ఘాటైన విమర్శలను ఎదుర్కొనవలసి వచ్చినది. కారణం ఆ కార్యక్రమ సంధానకర్త అని రాయనివారు లేరు. ఆమెను, ఆమె ఎంపికకు సంబంధించిన అధికారులను తొలగించి, భవిష్యత్తులో ఇటువంటి వారిని ఎంపిక చేయరాదని తీర్మానించడమైనది. మేము నిర్వహించిన మౌఖిక పరీక్ష నిజానికి మీ దృఢమైన సంకల్పానికి పరీక్ష. భాషను పునరుజ్జీవింపజేయడమే మా లక్ష్యం. మున్ముందు మరొక అవకాశమునకై ఎదురుచూడగలరు. విజయోస్తు!"

ఆమె ముఖ కవళికలను గమనించిన అమ్మమ్మ "ఏమైందే?" అనడిగింది.

"ఉద్యోగం రాలేదమ్మమ్మా!" అన్నది దిగులుగా.

లోపలకు వెళుతున్నవాడల్లా హఠాత్తుగా ఆగిపోయాడు బుజ్జి.

"ఎందువల్లనే?"

"నా తప్పే. ఇంటర్వ్యూలో వాళ్ళడిగిన ప్రశ్నలకు ఆ టి.వి. యాంకరు మాదిరి కాస్త తింగరగా జవాబిచ్చాను. అందుకే..."

బుజ్జి "య్యాహ్హా!" అంటూ ఆకాశమంత ఎత్తుకు ఎగిరాడు.

బాత్రి బుజ్జివైపు అనుమానంగా చూసింది. తర్వాత అమ్మమ్మతో "అవునుగాని అమ్మమ్మా, నాకు ఉద్యోగం వస్తేనే కదా వీడికి గుండు. మరి ముందుగానే ఎందుకు గీయించావు?" అన్నది.

"వాడికి నేను గుండు గీయించడమేమిటి!"

"... మరైతే..."

"అక్కా! అన్నవరం, తిరపతిల కంటే మనూరు శ్రీనివాసుడు ఇంకా పవర్‌ఫుల్. నా మొక్కుబడి అమాంతంగా, నుంచున్నపళాన, క్షణాల మీద తీర్చేశాడు. నీకా ఉద్యోగం రాగూడదని మొక్కుకుని ముందుగానే గుండు గీయించుకున్నాను. ఏది ఏమైనా నా గుండు నాకు తప్పేదికాదని తెలుసు. ఇప్పుడిది నా స్వంత గుండు. ఇన్నాళ్ళకు నాకోసం నేనుగా గీయించుకున్నందుకు హాయిగా, తృప్తిగా ఉంది. నిజంగా దేవుడున్నాడు" అంటూ అరిచాడు ఆనందంతో.

అనువాదములు, అనుకరణలు పనికిరావని పదే పదే చెప్పడం ఇందుకేనేమో అని బాత్రికి అప్పుడనిపించింది. ★